సాక్షి ఖమ్మం

గురువారం । 20 । జూన్ । 2024



'కార్గో' సేవల్లో ఆర్టీసీ భేష్

ఆర్టీసీలో కార్గో ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందుతుండగా ఆదరణ కూడా పెరుగుతోంది. దీంతో సంస్థ లాభాలు ఆర్జిస్తోంది. 8లో



వెదజల్లడంపై ఆసక్తి

వరి సాగు చేసే రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరిస్తే ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతుండడంతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. 10లో



వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. కొన్ని చోట్ల జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రజాభవన్‌ నుంచి బయలుదేరి రోడ్డుమార్గం ద్వారా 11 గంటలకు బోనకల్‌ మండలం నాగులవంచకు చేరుకుని అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు. 11.10 నుంచి 11.30 వరకు తిమ్మినేనిపాలెం – నాగులవంచ బీటీ రోడ్డుకు, 11.40 నుంచి 12.40 వరకు నాగులవంచ–సీతంపేట బీటీ రోడ్డుకు, 2 గంటలకు చిన్నమండవ – తిమ్మినేనిపాలెం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 2.45 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 4 నుంచి 6 గంటల వరకు ఉషాహరి కన్వెన్షన్‌ హాల్‌లో జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహాసభలో పాల్గొంటారు. ఆ తర్వాత తిరిగి రోడ్డుమార్గంలో హైదరాబాద్‌ వెళ్తారు.

కేఎంసీ కమిషనర్‌గా కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

ఖమ్మంమయూరిసెంటర్‌ : ఖమ్మం మున్సిపల్‌ కమిషనర్‌గా కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ అదనపు బాధ్యతలు చేపట్టారు. కేఎంసీ కమిషనర్‌ ఆదర్శ్‌ సురభి వనపర్తి కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం విధితమే. ఆ తర్వాత ప్రభుత్వం ఎవరినీ కమిషనర్‌గా నియమించలేదు. ఇక ఆదర్శ్‌ సురభి మంగళవారం విధుల నుంచి రిలీవ్‌ కాగా.. కేఎంసీ అధికారులు కలెక్టర్‌కు సంబంధిత ఫైల్‌ను సమర్పించారు. దీంతో ఆయన కేఎంసీ కమిషనర్‌గా బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. అయితే కేఎంసీ కమిషనర్‌గా నల్గొండ అదనపు కలెక్టర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ పేరు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

పదోన్నతులు.. విధుల్లో చేరిక



శాంతినగర్‌ హైస్కూల్‌లో ఎస్‌ఏగా చేరుతున్న ఉపాధ్యాయుడు

ఖమ్మం సహకారనగర్‌ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావటంతో వారు ఆయా స్థానాల్లో విధుల్లో చేరారు. జిల్లాలోని పండిట్‌, పీఈటీ, ఎస్జీటీలకు స్కూల్‌ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 954 మందికి పదోన్నతులు రాగా.. 875 మంది బుధవారమే విధుల్లో చేరినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మిగతా వారు నేడు విధుల్లో చేరే అవకాశం ఉంది.

గ్రూప్‌-2 అభ్యర్థులకు ఉచిత గ్రాండ్‌ టెస్ట్‌లు

ఖమ్మంమయూరిసెంటర్‌ : టీజీపీఎస్సీ గ్రూప్‌ – 2 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బీసీ స్టడీసర్కిల్‌ ఆధ్వర్యంలో ఉచిత గ్రాండ్‌ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్‌ జి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రూప్‌-2 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ టెస్ట్‌లు రాసేందుకు ఈనెల 19 నుంచి జూలై 5 వరకు బీసీ స్టడీసర్కిల్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మొత్తం నాలుగు గ్రాండ్‌ టెస్ట్‌లు నిర్వహిస్తామని, ఈ పరీక్షలన్నీ ఖమ్మంలోని ఎన్టీఆర్‌ సర్కిల్‌ వద్ద గల బీసీ స్టడీ సర్కిల్‌లో ఉంటాయని తెలిపారు.

మొదటి గ్రాండ్‌ టెస్ట్‌..

- జూలై 8న ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు పేపర్‌–1, మధ్యాహ్నం 1.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు పేపర్‌–2 పరీక్ష
- జూలై 9న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్‌–3, మధ్యాహ్నం 1.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు పేపర్‌ –4 పరీక్ష

రెండో గ్రాండ్‌ టెస్ట్‌..

- జూలై 15 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్‌–1, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్‌–2 పరీక్ష
- జూలై 16న ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్‌–3, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పేపర్‌–4 పరీక్ష

మూడో గ్రాండ్‌ టెస్ట్‌..

- జూలై 22 ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్‌–1, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్‌–2 పరీక్ష
- జూలై 23న ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్‌–3, మధ్యాహ్నం 1.30 నుండి సాయంత్రం 4 వరకు పేపర్‌–4 పరీక్ష

నాలుగో గ్రాండ్‌ టెస్ట్‌..

- జూలై 30 ఉదయం 10 నుంచి 12.30 వరకు పేపర్‌ –1, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్‌–2 పరీక్ష
- జూలై 31న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్‌–3, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 వరకు పేపర్‌–4 పరీక్ష ఉంటాయని వివరించారు.



పల్లె వైద్యుల మాయ!

అర్హత లేని వైద్యంతో గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్‌ఎంపీ, పీఎంపీలు రోగులను పీల్చి పిప్పిచేస్తున్నారు. డాక్టర్లుగా చలామణి అవుతూ యాంటిబయోటిక్‌, స్టెరాయిడ్‌, పెయిన్‌ కిల్లర్‌ ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలుగా ఉన్న ఈ క్లినిక్‌ల్లో పలు రకాల ఆపరేషన్లు కూడా చేస్తున్నట్లు తేలింది. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ (టీజీఎంసీ), ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ (ఐఎంఏ) 22 ప్రాంతాల్లో తనిఖీలు చేయగా 122 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు అర్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

మోతాదుకు మించి డోస్‌తో గ్రామాల్లో వైద్యం

- ఎలాంటి అర్హత లేకుండానే చికిత్స
- ఉమ్మడి జిల్లాలో టీజీఎంసీ, ఐఎంఏ బృందాల తనిఖీలు
- 122 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీల గుర్తింపు
- చట్టపరమైన చర్యలకు ప్రభుత్వానికి నివేదిక

గ్రామీణ డాక్టర్లమంటూ..

ఆర్‌ఎంపీలు (రూరల్‌ మెడికల్‌ ప్రాక్టీషనర్స్‌), పీఎంపీలు (పారా మెడికల్‌ ప్రాక్టీషనర్స్‌) ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలో చూసినా ఇద్దరు, ముగ్గురి కంటే ఎక్కువ మంది వైద్యం చేస్తున్నారు. గ్రామాల్లోని పేదల అమాయకత్వాన్ని, వైద్య అవసరాన్ని ఆసరా చేసుకుని వచ్చీరాని వైద్యం చేస్తున్నారు. ఏ వ్యాధికైనా ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా పట్టణాల్లో ప్రైవేట్‌ ఆస్పత్రులకు రిఫర్‌ చేయాలి. కానీ ఈ కేంద్రాల్లో నయం కాని వ్యాధులకు సైతం చికిత్స చేస్తున్నారు. గ్రామీణ డాక్టర్లమంటూ తమ కేంద్రాల్లో పదుల సంఖ్యలో పడకలు కూడా ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. ఎలాంటి వైద్య విద్య అర్హత లేకున్నా మోతాదుకు మించి మందులు, ఇంజెక్షన్లు ఇస్తున్నారు. అంతేకాక వైద్య, ఆరోగ్య శాఖ అనుమతి లేని చట్టవిరుద్ధమైన ఆపరేషన్లు కూడా ఉమ్మడి జిల్లాలోని పలు కేంద్రాల్లో జరుగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఇలాంటి ఆపరేషన్లు చేస్తు రూ.వేలల్లో దండుకుంటున్నారు.

22 ప్రాంతాల్లో తనిఖీలు..

టీజీఎంసీ, ఐఎంఏల నుంచి 30 మంది సభ్యులుగా ఉన్న పది బృందాలు ఇటీవల ఉమ్మడి జిల్లాలోని 22 ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నేలకొండపల్లి, కొణిజర్ల, ఖమ్మంఅర్బన్‌, ఖమ్మంరూరల్‌, కూసుమంచి, ఎం.వెంకటాయపాలెం, ముదిగొండ, వైరా, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు, కల్లూరు, కొత్తగూడెం, సుజాతనగర్‌, వీఎం.బంజర, రఘునాథపాలెం, కారేపల్లి, ముల్కలపల్లి, టేకులపల్లి, కామేపల్లి, ఇల్లెందు, ముచ్చర్ల, తిమ్మారావుపేటలో ఆర్‌ఎంపీలు, పీఎంపీల కేంద్రాలను పరిశీలించాయి. విద్యార్హతలు లేకుండా డాక్టర్లుగా చెప్పుకుంటూ 122 మంది వారు ఏర్పాటు చేసుకున్న ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్లలో వైద్యం అందిస్తున్నట్లు ఈ బృందాలు గుర్తించాయి. పలు రకాల మందులు, స్టెరాయిడ్స్‌ను ఆయా కేంద్రాల్లో స్వాధీనం చేసుకున్నాయి. కొంతమంది ఏకంగా డాక్టర్లుగా తమ కేంద్రాల్లోని బోర్డ్‌పై రాసుకున్నట్లు గుర్తించారు.

చర్యలకు నివేదిక..

తనిఖీల అనంతరం ఈ బృందాలు ప్రభుత్వానికి నివేదిక అందజేశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 122 మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ వైద్యులుగా చలామణి అవుతున్నారని నివేదికలో పేర్కొన్నారు. నేషనల్‌ మెడికల్‌ కమిషన్‌ (ఎన్‌ఎంసీ) యాక్టు 34, 54 సెక్షన్ల ప్రకారం వీరిపై కేసులు నమోదు చేయాలని సిఫార్సు చేశాయి. వైద్య, ఆరోగ్య శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న ఈ కేంద్రాలపై చర్యలు తీసుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇచ్చినట్లు అవుతుంది. అలాగే అనుమతులు ఉన్నా ఇష్టారీతిన వైద్యం చేసే ఆర్‌ఎంపీలు, పీఎంపీల దందాకు అడ్డుకట్ట పడనుంది.

నిరంతర నిఘా లేకనే..

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కనీసం నెలకు ఒకసారైనా ఈ కేంద్రాలతో పాటు పట్టణాల్లోని ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. నిరంతరం నిఘా, తనిఖీలు లేకపోవడంతో ఆర్‌ఎంపీలతో పాటు పట్టణాల్లోని ప్రముఖ ఆస్పత్రుల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అవసరం లేకున్నా మందులు, స్కానింగ్‌లు తీయిస్తూ రోగుల జేబులకు చిల్లులు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు.. పట్టణ ప్రాంతాల్లో పేరొందిన ఆస్పత్రులు ఇచ్చే కమీషన్లకు ఆశపడి.. వైద్యం అవసరం లేకున్నా ప్రజలను ఇక్కడికి రిఫర్‌ చేస్తున్నారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాంగం.. రాష్ట్ర స్థాయి వైద్య బృందాలు వచ్చి తనిఖీలు చేసినప్పుడే కదులుతున్నాయి. ఆ తర్వాత షరామామూలే అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో మళ్లీ ఆర్‌ఎంపీలు, ప్రైవేట్‌ ఆస్పత్రులు మెడికల్‌ దందాకు పాల్పడుతున్నాయి.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం



మహాసభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన మీడియా అకాడమీ చైర్మన్‌ శ్రీనివాసరెడ్డి, అమర్‌ తదితరులు

- అర్హులందరికీ కొద్ది రోజుల్లోనే ఇళ్లస్థలాలు
- టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మహాసభల్లో మంత్రి పొంగులేటి

ఖమ్మం సహకారనగర్‌ : రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని ఉషాహరి కన్వెన్షన్‌(అమర్‌నాథ్‌ ప్రాంగణం)లో జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మూడో మహాసభలను బుధవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో వైఎస్సార్‌ హయాంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించారని, మళ్లీ ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వంలో తామే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి కొన్ని చోట్ల మంజూరైనప్పటికీ కోర్టులో వివాదం ఉందని, ఆ తర్వాత క్లియరెన్స్‌ వచ్చినా గత ప్రభుత్వం స్థలాలు ఇవ్వలేదని అన్నారు. ఖమ్మం నగరంలో ఇదివరకే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు జీఓ ఇచ్చారని, ఆ జీఓ అమలుకు ఇంకొంత పని ఉన్నప్పటికీ దానిని పరిష్కరించి కొద్ది రోజుల్లోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ముందుగా ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా స్థలాలు కేటాయించాలని తాను కలెక్టర్‌ను ఆదేశించానని చెప్పారు. అక్రిడిటేషన్ల రెన్యూవల్‌ మరో మూడు నెలల వరకు పొడిగించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి..

వర్కింగ్‌ జర్నలిస్టులంతా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని మీడియా అకాడమీ చైర్మన్‌ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పదేళ్లుగా జర్నలిస్టులు తమ సమస్యలను చెప్పుకునేందుకు నాటి ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేదని, ఇక సమాచార శాఖ అంతర్థానం అయిపోయిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని చెప్పారు. జిల్లా పరిషత్‌ చైర్మన్‌ లింగాల కమల్‌రాజ్‌, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, యూనియన్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్‌, విరాహత్‌ అలీ, ఐజేయూ మాజీ అధ్యక్షులు ఎస్‌ఎన్‌ సిన్హా, దేవులపల్లి అమర్‌ మాట్లాడారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ కూరపాటి ప్రదీప్‌కుమార్‌ అధ్యక్షోపన్యాసం చేశారు. తొలుత టీయూడబ్ల్యూజే పాట విడుదల చేశారు. రామోజీ గ్రూప్‌ సంస్థల చైర్మన్‌ రామోజీరావు, అమరవీరుల మృతికి సంతాపం ప్రకటించారు. సభలో ఐజేయూ సెక్రటరీ జనరల్‌ బల్విందర్‌ సింగ్‌ జమ్మూ, రాష్ట్ర గిడ్డంగుల నిర్వహణ సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఐజేయూ స్టీరింగ్‌ కమిటీ సభ్యులు ఎంఏ మాజిద్‌, కార్యదర్శులు వై.నరేందర్‌ రెడ్డి, డి.సోమసుందర్‌, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, ఆలపాటి సురేష్‌కుమార్‌, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, యూనియన్‌ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే సమానత్వం

కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఖమ్మం సహకారనగర్‌ : విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం పాఠశాలల్లో అవసరమైన భౌతిక, మౌలిక వసతులు కల్పిస్తోందని, విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్‌ పుస్తకాలు, నాణ్యత గల మధ్యాహ్న భోజనం అందిస్తోందని చెప్పారు. విద్యార్థుల అడ్మిషన్ల నమోదు శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు నూరు శాతం ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థి ఒకరోజు గైర్హాజరైతే కారణం తెలుసుకుని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. తరుచుగా గైర్హాజరైతే విద్యార్థి కుటుంబసభ్యులతో మాట్లాడాలని చెప్పారు. విద్యార్థుల హాజరు ఎంత ముఖ్యమో, ఉపాధ్యాయుల హాజరు కూడా అంతే ముఖ్యమని, టీచర్లు సమయపాలన పాటించాలని అన్నారు. సమావేశంలో డీఈఓ ఈ. సోమశేఖర శర్మ, సీఎంఓ వై.రాజశేఖర్‌, ఏఎంఓ కె.రవికుమార్‌, కోఆర్డినేటర్లు రామకృష్ణ, భూలక్ష్మి, భానుప్రకాష్‌, పాపారావు, డీఎస్‌ఓ జగదీష్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు రాయల నర్సింహారావు, కందుల వెంకటనర్సయ్య, గుడిపూడి శ్రీనివాసరావు, సతీష్‌, వెంకట రమణయ్య తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి..

ఖమ్మంవైద్యవిభాగం : బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిని సందర్శించి జనరల్‌, శస్త్ర చికిత్స విభాగాలు, ప్రసూతి వార్డుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి స్వయంగా రోగుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. మాతాశిశు కేంద్రంలోని కుటుంబ నియంత్రణ, ఓపీ, స్కానింగ్‌ గదులను పరిశీలించారు. ప్రసూతి వార్డుల్లో బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, భోజనం, సిబ్బంది పని విధానంపై ఆరా తీశారు. రోగుల సహాయకులతో మాట్లాడి సేవలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. కలెక్టర్‌ వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్‌ ఎల్‌.కిరణ్‌ కుమార్‌, డిప్యూటీ సూపరింటెండెంట్‌ బి.కిరణ్‌కుమార్‌, ఆర్‌ఎంఓలు అమర్‌ సింగ్‌, రాంబాబు, రాథోడ్‌ వినాయక్‌ ఉన్నారు.



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్ల సహాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

ఇందిరానగర్‌ పాఠశాలలో తనిఖీ..

ఖమ్మంఅర్బన్‌: నగరంలోని ఇందిరానగర్‌ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఒక విద్యార్థితో పాఠం చదివించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఫలితమిచ్చిన బడిబాట



పెనుబల్లి మండలం భవన్నపాలెంలో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

- 10వేల మందికి పైగా విద్యార్థుల చేరిక
- కలిసొచ్చిన ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు

ఖమ్మం సహకారనగర్‌ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్‌ జయశంకర్‌ బడిబాట కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లలను గుర్తించి 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రోజుకొక కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా బుధవారం నాటికి 10,065 మంది విద్యార్థులు సర్కారు స్కూళ్లలో ప్రవేశాలు పొందారు.

కలిసొచ్చిన సౌకర్యాలు..

గతేడాది నిర్వహించిన 'మన ఊరు – మన బడి, మన బస్తీ మన బడి' కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అందంగా ముస్తాబయ్యాయి. ఇక ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అదే విధంగా పాఠశాలల పునఃప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, ఒక జత యూనిఫాం అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విశ్వాసం కల్పించడంతో ప్రవేశాలు పెరిగినట్లు తెలుస్తోంది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం, ఇంగ్లిష్‌ మీడియం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుండడం కూడా కారణాలుగా చెప్పొచ్చు. అత్యధికంగా 1వ తరగతిలో 4,295 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. మొత్తంగా 10,065 మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

ప్రవేశాలు పెరిగాయి



జిల్లాలో చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. గతేడాది ఏడువేలకు పైగా ప్రవేశాలు ఉండగా, ఈ సారి సుమారు 10,065 మంది విద్యార్థులు చేరారు. కలెక్టర్‌, డీఈఓ ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నాం.

– రాజశేఖర్‌, సీఎంఓ

ఎన్‌సీసీ క్యాంప్‌ను సందర్శించిన డైరెక్టర్‌



డైనింగ్‌ హాల్‌ను పరిశీలిస్తున్న వీ.ఎం. రెడ్డి

కూసుమంచి : పాలేరులోని జవహర్‌ నవోదయ విద్యాలయలో లెవెన్త్‌ బెటాలియన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఏటీసీ – 4 క్యాంప్‌ను ఎయిర్‌ కమాండర్‌, డీడీసీ తెలంగాణా, ఆంధ్రా డైరెక్టర్‌ వీ.ఎం. రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కేడెట్లు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం విద్యాలయలో శిక్షణకు వచ్చిన వారికి కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వీ.ఎం.రెడ్డి మాట్లాడుతూ.. కేడెట్లు వ్యక్తిత్వ వికాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యాలయలో ఈనెల 24 వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు క్యాంప్‌ కమాండెంట్‌, లెఫ్టినెంట్‌ కల్నల్‌ నవీన్‌యాదవ్‌ తెలిపారు. శిక్షణలో ఖమ్మం, వరంగల్‌, భద్రాద్రి, మహబూబాబాద్‌ జిల్లాలకు చెందిన 560 మంది కేడెట్లు పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కల్నల్‌ సచిన్‌ నింబాల్కర్‌, కల్నల్‌ సంజయ్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం పంచామృతాలతో స్నపన తిరుమంజనం గావించారు. ఆ తర్వాత బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

నులిపురుగుల నిర్మూలనకు సహకరించాలి

- పాఠశాలలు, కళాశాలల్లో నేడు ఆల్బెండజోల్‌ మాత్రల పంపిణీ
- డీఎంహెచ్‌ఓ మాలతి వెల్లడి

ఖమ్మంవైద్యవిభాగం : నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతో గురువారం ఆల్బెండజోల్‌ మాత్రలు మింగించనున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.మాలతి తెలిపారు. 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. 1 – 2 ఏళ్లలోపు చిన్నారులకు అరమాత్ర, 3 – 19 ఏళ్ల మధ్య వయసు వారికి 400 మిల్లీ గ్రాముల ఒక మాత్ర భోజనం తర్వాత మింగించాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యతో బాధపడేవాకి ఇవ్వొద్దని సూచించారు. ఈ మాత్రలు వేసుకుంటే పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి ఉంటుందని, రక్తహీనత బారి నుంచి రక్షించవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,618 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, 1,840 అంగన్‌వాడీ సెంటర్లలో మాత్రలు మింగించనున్నట్లు వివరించారు. మిగిలిన వారికి ఈ నెల 27న ఇంటింటికీ తిరిగి మాత్రలు మింగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని వివిధ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్‌ అధికారి డాక్టర్‌ డి.ప్రమీల తెలిపారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

సికిల్‌ సెల్‌పై అవగాహన కల్పించాలి..

సికిల్‌ సెల్‌ ఎనీమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ మాలతి సూచించారు. ట్రైబల్‌ వెల్ఫేర్‌, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్‌ సికిల్‌ సెల్‌ ఎనీమియా ఎలిమినేషన్‌ మిషన్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అవగాహన, స్క్రీనింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సికిల్‌ సెల్‌ ఎనీమియా పుట్టుకతో వచ్చే వ్యాధి అని, హెచ్‌బీ శాతం తగ్గిన వారు తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వారిలో రక్తహీనత, నొప్పి, చేతులు, కాళ్ల వాపు, దృష్టి సమస్యలు ఉంటాయని తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎనీమియా సమస్యతో ఉండే వారు ఆక్సిజన్‌ తగ్గిపోయి నొప్పితో ఇబ్బందులు పడుతుంటారని, ఈ సమస్యను అదుపులో ఉంచాలంటే స్క్రీనింగ్‌తో పాటు అవగాహన ముఖ్యమని తెలిపారు. టీడబ్ల్యూ డీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ 2047 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, ప్రోగ్రామ్‌ అధికారి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని ఫ్లిఫ్‌కార్ట్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేసేందుకు టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లోని ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 18 – 40 ఏళ్ల లోపు వారు రావచ్చని పేర్కొన్నారు. వేతనం రూ.15 వేల నుంచి 25 వేల వరకు ఉంటుందని, ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీలోని శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంతకు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసా చట్టం ప్రకారం జీపీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని, ధరావత్ సొమ్ము రూ.30 లక్షలు, సాల్వెన్సీ రూ.5 లక్షలు జీపీకి నగదు లేదా డీడీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

23న ఖమ్మంలో పద్యగాన పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: తొలి తెలుగు సినీ గేయ రచయిత, 'పరబ్రహ్మ పరమేశ్వర' నాటక ప్రారంభ ప్రార్థన గీత సృష్టికర్త చందాల కేశవదాసు 148వ జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పద్య గాన పోటీలను నిర్వహిస్తున్నట్లు చందాల కేశవదాసు కళా పరిషత్ అధ్యక్షులు కొండపల్లి జగన్మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని, ఏ నాటకం నుంచైనా రెండు పద్యాలను గానం చేయొచ్చని, విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. హార్మోనియం, ఆర్కెస్ట్రా అందుబాటులో ఉంటాయని, మరిన్ని వివరాలకు 89190 57578 నంబర్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు.

వ్యక్తిపై దాడి

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన వడ్లమూడి సత్యనారాయణపై గ్రామ చెరువు సమీపంలో మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు దాడి చేయగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పొలం వద్ద నుంచి ఇంటికి వస్తున్న సమయంలో కొందరు దాడి చేసి కళ్లలో కారం చల్లి కాళ్లు కట్టేసి చేతులు పట్టుకుని బలవంతంగా పలు పేపర్లపై వేలిముద్రలను తీసుకున్నట్లు సత్యనారాయణ తెలిపాడు. రఘునాథపాలెం మండలానికి చెందిన కొందరు వ్యక్తులతో తనకు ఆస్తి వివాదం ఉందని, వారే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్ సందర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

మహిళను వేధించిన కేసులో జైలు శిక్ష

ఖమ్మంలీగల్: మహిళను వేధించిన కేసులో కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన సయ్యద్ వజీర్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ స్థానిక మూడో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి పి.మాధవి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. వజీర్ అదే గ్రామానికి చెందిన భర్తలేని ఓ మహిళను వేధిస్తున్నాడు. 2018, డిసెంబర్ 12న ఆమె ఇంట్లోకి ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించాడు. దీంతో సదరు మహిళ కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువైందని శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ రాహుల్ వాదించగా, లైజన్ ఆఫీసర్ మోహన్‌రావు సహకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ జయనగర్‌కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ప్రకాష్‌నగర్‌కు చెందిన ప్యాకర్స్ మేస్త్రీ మాదాసు రవి (35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ ఫర్నిచర్ షాపులో వస్తువులను సర్దుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి కిందపడ్డాడు. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మంఅర్బన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన పెనుబల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన గడ్డం నవీన్ తన ద్విచక్ర వాహనంపై వీఎం బంజర్ నుంచి పెనుబల్లి వైపు జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గమధ్యలో పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎదురుగా ప్రభుత్వ ఆస్పత్రి వైపు నుంచి పెనుబల్లి వైపు యూటర్న్ తీసుకుంటున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

'కార్గో' సేవల్లో ఆర్టీసీ భేష్

- కొరియర్ సర్వీస్‌తో ఆదరణ
- రీజియన్‌లో సంస్థకు గణనీయంగా పెరిగిన ఆదాయం
- జూన్ 19తో కార్గో సేవలు ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి
- నాలుగేళ్లలో 12.81 లక్షల బుకింగ్‌లకు రూ.18.54 కోట్ల ఆదాయం



కార్గో సేవలకు నాలుగేళ్లు పూర్తవడంతో కేక్ కట్ చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్గో ద్వారా ఆర్టీసీ సంస్థ ప్రజలకు విస్తృత సేవలను అందించడంతోపాటు లాభాలను ఆర్జిస్తోంది. గతంలో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ 'ఆర్టీసీలో ప్రయాణం సుఖవంతం.. సురక్షితం' అనే నినాదంతో పనిచేసేది. ఇప్పుడు ప్రజల వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో కూడా ముందు వరుసలో నిలుస్తోంది. ప్రజలు సంతృప్తి చెందడంతో కార్గో సేవలు ఎప్పటికప్పుడు విస్తృతమవుతూ వస్తున్నాయి. 2020, జూన్ 19న ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్రంలో కార్గో సేవలను ప్రారంభించగా.. బుధవారంతో నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఈకాలంలోనే కార్గో సేవలు ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నాయి. నాలుగేళ్లు పూర్తి కావడంతో ఖమ్మం కొత్త బస్టాండ్ కార్గో సెంటర్‌లో బుధవారం డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో కేక్ కట్ చేయించారు.

నమ్మకం, సురక్షితం..

నాలుగేళ్ల కార్గో సేవలపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది. ఏ పార్శిల్ ఇచ్చినా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుతుండటంతో ఈ సేవలను వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్న లెటర్ నుంచి కంప్యూటర్లు, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, పండ్లు, ఇతర సామగ్రి ఏదైనా కార్గోలో రవాణా చేసే వీలుండటంతో అందరూ కార్గో బాట పడుతున్నారు. ప్రైవేట్ పార్శిళ్ల సర్వీసుల్లో అన్ని రకాల వస్తువులను బుక్ చేయకపోవడం.. ఆ సర్వీసుల అడ్రస్‌లు తెలుసుకోవడం కొంత ఇబ్బంది అవుతోంది. ఇదే క్రమంలో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం కావడంతో కార్గో సేవలను సులువుగా పొందుతున్నారు. వినియోగదారుడు పార్శిల్ ఇవ్వగానే ఆర్టీసీ బస్ ద్వారానే ఆ పార్శిల్‌ను పంపుతుండటంతో గమ్యస్థానానికి చాలా వేగంగా చేరుతున్నాయి. బుక్ అయిన వెంటనే సెల్‌కు మెసేజ్ వస్తుండటం.. డెలివరీ అయిన వెంటనే కూడా మెసేజ్ వస్తుండటంతో ఎలాంటి అనుమానాలు లేకుండా ఖరీదైన వస్తువులను కూడా బుక్ చేసుకునేందుకు వీలవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇంటి వరకు డెలివరీ చేసే సౌకర్యం కూడా కల్పించడంతో కార్గో సేవలపై ప్రజలు మక్కువ చూపుతున్నారు.

నాలుగేళ్లలో కార్గో ద్వారా ఖమ్మం రీజియన్‌లో లభించిన ఆదాయం వివరాలు..

ఏడాది	బుకింగ్స్ (లక్షల్లో)	ఆదాయం (రూ.లలో)
2020-21	1.78	రూ.1.71 కోట్లు
2021-22	3.23	రూ.3.82 కోట్లు
2022-23	3.76	రూ.5.77 కోట్లు
2023-24	4.04	రూ.7.24 కోట్లు

కార్గో సేవలకు ప్రాధాన్యం..

ఆర్టీసీలో కార్గో సేవలకు ప్రాధాన్యం పెరిగింది. ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో.. కార్గో ద్వారా పార్శిళ్లను గమ్యస్థానాలకు చేర్చడంపై కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారు. వస్తువులు రవాణా చేసేందుకు ఆర్టీసీ బస్సులో ప్రత్యేకంగా సీటు కేటాయించారు. ఈ సీట్లలో బుక్ చేసిన పార్శిళ్లను లోడ్ చేస్తున్నారు. చిన్నచిన్న వస్తువులు, 25 కేజీల్లోపు పార్శిళ్లను ఆర్టీసీ బస్సుల్లో ముందు సీట్లలో లోడ్ చేసి భద్రంగా తరలిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఉండే పార్శిళ్లు, వ్యవసాయ పనిముట్లు, బరువు కలిగిన పార్శిళ్లను కార్గో బస్సు ద్వారా తరలిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన కార్గో సేవలను అందించాలనే సంకల్పంతో సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అలాగే ఇతర పార్శిల్ సర్వీసులతో పోలిస్తే బుకింగ్ చార్జీలు కూడా తక్కువగా ఉన్నాయని వినియోగదారుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. పార్శిల్ అన్‌లోడ్ అయిన వెంటనే గమ్యస్థానంలోని వినియోగదారునికి సమాచారం అందిస్తున్నారు. దీంతో పార్శిల్ తీసుకోవడం వినియోగదారుడికి సులువు అవుతోంది.

నాలుగేళ్లల్లో రూ.18.54 కోట్లు..

కార్గో సేవలను ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయింది. ఈ నాలుగేళ్లలో ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో రూ.18.54 కోట్ల ఆదాయం లభించింది. ఇక ఇప్పటి వరకు మొత్తం 12.81 లక్షల పార్శిళ్లు కార్గో ద్వారా బుక్ అయ్యాయి. కార్గో ద్వారా ఏడాదికేడాది ఆదాయం పెరుగుతూ వచ్చింది. సేవలను విస్తృత పరచడంతో ఆదాయం కూడా అదే తరహాలో పెరిగింది. ఆర్టీసీ సిబ్బంది ద్వారానే కార్గో సేవలను అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు, ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడికి పార్శిళ్లు వస్తున్నాయి. వీటిని సక్రమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు, కండక్టర్లతోపాటు వినియోగదారుడికి పార్శిళ్లను ఎటువంటి ఇబ్బంది లేకుండా అందజేయడంలో సిబ్బంది పనితీరు కీలకంగా మారింది. నాలుగేళ్లలో అక్కడక్కడా తప్ప పూర్తిస్థాయిలో ప్రజలకు నమ్మకమైన సేవలు అందాయి.

ఆర్టీసీని ఆదుకున్న కార్గో..

కరోనా సమయంలో లాక్‌డౌన్ అనంతరం ప్రభుత్వం ఈ కార్గో సేవలను ప్రారంభించింది. లాక్‌డౌన్ సమయంలో కుదేలైన ఆర్టీసీని కార్గో ఆదుకుంది. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ కార్గో సేవలు విజయవంతమయ్యాయి. దీంతో ప్రస్తుతం ఆర్టీసీకి కార్గో ఆదాయ వనరుగా మారింది. ప్రజలకు కూడా కార్గో సేవలు ఉపయుక్తంగా మారాయి. బస్టాండ్‌కు వచ్చి పార్శిళ్లు బుక్ చేయడం, తీసుకోవడం ఇబ్బంది లేకుండా ఉందని ప్రజలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కార్గో సేవలను అందించేందుకు 51 ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. కార్గో ద్వారా రోజుకు 1100కు పైగా పార్శిళ్లు బుక్ అవుతున్నాయి.

ఉద్యాన రైతులకు రాయితీలు విడుదల

- ఆయిల్ పామ్ తోటలకు రూ.3.72 కోట్లు
- బిందు సేద్యం పరికరాలకు రూ.45.94 లక్షలు విడుదల



ఆయిల్ పామ్‌లో అంతర పంటగా సాగులో ఉన్న ఉద్యాన పంట

ఖమ్మంవ్యవసాయం: 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు, బిందు సేద్యం పరికరాల రాయితీలను బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఆయిల్‌పామ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆ పంట సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. అవసరమైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు, అంతర పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడులు, నీటి యాజమాన్యానికి బిందు సేద్యం పరికరాలు తదితరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. 2022–23 ఏడాదిలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలకు ప్రభుత్వం రూ.3.72 కోట్లను విడుదల చేసింది. జిల్లాలో 2,483 మంది రైతులు 10,561.80 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను వేశారు. అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, మిర్చి, కూరగాయల సాగుకు ఎకరాకు రూ.2,150, నిర్వహణకు మరో రూ.2,150 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకరంగా అందిస్తోంది. ఉద్యాన పంటల నీటి యాజమాన్యం కోసం ఉపయోగించే పరికరాలకు 2022–23 ఏడాదికి గాను 45.94 లక్షలు విడుదల చేసింది. 725 ఎకరాల్లో 159 మంది రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. రాయితీలను ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి బీవీ రమణ తెలిపారు.

కేఎంసీ అధికారుల్లో 'విజిలెన్స్' దడ

- తనిఖీల్లో అభివృద్ధి పనుల నాణ్యత లోపం గుర్తించినట్లు చర్చ
- 20శాతం కోతతో బిల్లులు చెల్లించేందుకు నిర్ణయించినట్లు సమాచారం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల్లో విజిలెన్స్ భయం పట్టుకుంది. 2019 నుంచి 2023 వరకు ఖమ్మం నగరంలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న కేఎంసీ కార్యాలయానికి వచ్చి జరిగిన అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించి, సమాచారాన్ని సేకరించారు. రెండు రోజుల పాటు కార్యాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించిన అధికారులు, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో జరిగిన పనులను సందర్శించి, వాటి నుంచి కోర్ కటింగ్‌లు తీయించారు. నమూనాలను పరీక్షించగా నెగిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు తేలిందని, పనుల నాణ్యతలో లోపం ఉందని విజిలెన్స్ అధికారులు గుర్తించారనే చర్చ కేఎంసీలో జరుగుతోంది. దీంతో కేఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లలో విజిలెన్స్ భయం పట్టుకుందన్న చర్చ బహిరంగంగానే వినిపిస్తోంది. విజిలెన్స్ నివేదికలు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో కేఎంసీ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

20 శాతం కోతతో బిల్లులు చేయండి..?

కేఎంసీలో జరిగిన అభివృద్ధి పనులను విజిలెన్స్ అధికారులు నిశితంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించిన అధికారులు ఎస్‌డీఎఫ్ నిధులతో జరిగిన పనులపై దృష్టి సారించారు. నగరంలో ఎక్కడెక్కడ ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు జరిగాయో గుర్తించి, ఆ పనుల వివరాలతో పాటు నమూనాలను సేకరించారు. ఈ తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు పలుమార్లు ఖమ్మం వచ్చి వెళ్లారు. అయితే విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో నాణ్యత లోపాన్ని గుర్తించినట్లు చర్చ జరుగుతుండటంతో కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లులను నిలిపివేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బిల్లులు చెల్లించాల్సి వస్తే 20 శాతం కోతతో బిల్లులు చెల్లించాలని నిర్ణయించినట్లు సమాచారం.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు నాణ్యతతో కూడిన వంట సరుకులు సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పలు ఏజెన్సీల ద్వారా సరఫరా అయ్యే వంట సరుకుల కోసం బుధవారం నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడానికి జిల్లాలో పేరొందిన ఏజెన్సీలను టెండర్ ప్రక్రియ ద్వారా కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపిక చేశామని, నాణ్యమైన పాలు, గుడ్లు, అరటి పండ్లు, కూరగాయలు, స్కిన్‌లెస్ చికెన్ సరఫరా చేయాలని, ఏమాత్రం కల్తీ సరుకులు సరఫరా చేసినా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపి వారి చదువుకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన వస్తువులనే సరఫరా చేయాలని ఏమైనా ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీసీసీ అధికారులు, మేనేజర్లు ఏజెన్సీల వారు సరఫరా చేస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించి నాసిరకంగా ఉన్న వస్తువులను పాఠశాలలకు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, రమణయ్య, దావీదు, నరసింహారావు, సురేశ్‌బాబు, ప్రమీలబాయి, రంగయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మధిర: మధిర పట్టణంలోని దళిత కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులపై బుధవారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పాత కక్షల నేపథ్యంలో అదే కాలనీకి చెందిన కూరపాటి చరణ్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనకు సంబంధించి బొందల వంశీ, సత్తి, రాజు, సత్యవతిపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

వేధింపుల కేసులో భర్తపై...

పాల్వంచరూరల్: తీవ్రంగా వేధింపులకు పాల్పడుతున్నాడని ఓ మహిళ తన భర్తపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని మొండికట్ట గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కందుకూరి శివకృష్ణ తన భార్యను వేధిస్తుండగా.. సర్ది చెప్పేందుకు వచ్చిన మేనమామ సైదులు, తండ్రి వెంకన్నతో గొడవపడి దాడి చేశాడు. రేణుక ఫిర్యాదు మేరకు శివకృష్ణపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

పండితాపురంలో రేషన్ బియ్యం పట్టివేత

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కానుగుల వెంకన్న 95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంటి సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో నిల్వ చేసి ఉంచగా సమాచారం తెలుసుకున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్ పట్టుకున్నారు. వ్యాపారిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఖమ్మం అర్బన్ డీటీ నిసార్, కామేపల్లి సివిల్ సప్లయ్ ఆర్‌ఐ పవన్‌కుమార్, వైరా ఆర్‌ఐ కిరణ్‌కుమార్, నేలకొండపల్లి ఆర్‌ఐ హరీశ్ పాల్గొన్నారు.



పట్టుబడిన బియ్యాన్ని చూపుతున్న అధికారులు

ముగిసిన డ్రైవింగ్ టెస్ట్

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 68 ఈపీ ఆపరేటర్ ఇంటర్నల్ పోస్టులకు సంబంధించి రెండు రోజులుగా నిర్వహిస్తున్న డ్రైవింగ్ ప్రొఫెషియన్సీ టెస్ట్ బుధవారంతో ముగిసింది. కొత్తగూడెం ఏరియాలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం రీజియన్‌లోని కార్మికులు 166 మందికి ఆరుగురు గైర్హాజరు కాగా 160 మందికి టెస్ట్ నిర్వహించారు. అందులో 86 మంది ఎంపికయ్యారు. ఏరియా జీఎం శాలేంరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, వి.మల్లికార్జున్‌రావు, కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, రామకృష్ణ, ఉపేందర్‌బాబు, శివకేశవరావు, యోహాన్, సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, మురళి, అజయ్‌కుమార్, సంఘమిత్ర, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్, ఉమర్ ఫారూఖ్ పాల్గొన్నారు.



టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న జీఎం శాలేంరాజు

భారీగా గంజాయి స్వాధీనం

రెండు చోట్ల పట్టుబడిన 360 కేజీల గంజాయి



పాల్వంచలో పట్టుబడిన గంజాయిని చూపుతున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: జిల్లాలో రెండు చోట్ల రూ.90 లక్షల విలువైన (360 కేజీలు)గంజాయిని పట్టుకున్నామని, ప్రత్యేక నిఘాతో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. బుధవారం పాల్వంచ, టేకులపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ గంజాయి పట్టుబడిందన్నారు. పాల్వంచ పట్టణంలోని జీసీసీ గోడౌన్ ఎదురుగా సాయంత్రం పాల్వంచ ఎస్‌ఐ–2 రాఘవ వాహన తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న 202 కేజీల గంజాయి (రూ.50,55,000 విలువైన) లభించిందని, దీనిని తరలిస్తున్న మెగావత్ జైపాల్‌ను అరెస్టు చేశామని చెప్పారు. టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకట్యాతండాలో ఎస్‌ఐ సైదారవూఫ్ సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా మారుతి కారులో కామారెడ్డి జిల్లాకు చెందిన పెనుగొండ వెంకటరాజు, బోదాసు తిరుపతి తరలిస్తున్న 158 కేజీల (రూ.39,50,000 విలువైన) గంజాయిని పట్టుకున్నామని పేర్కొన్నారు. కార్లతో పాటు తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ రోహిత్‌రాజు వివరించారు.

డీఎస్‌డబ్ల్యూఓ విజేత ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు బుధవారం హ్యాక్ చేశారు. వెంటనే తేరుకున్న ఆమె తన అకౌంట్ హ్యాక్ అయిందని ఫేస్‌బుక్ అకౌంట్‌లో, వాట్సప్ స్టేటస్‌లో పెట్టారు. దీంతో ఎవరూ ఫేక్ అకౌంట్‌కు నగదు జమ చేయకుండా జాగ్రత్త పడ్డారు. 'నా ఫోన్ పే పనిచేయడం లేదు..రూ.16,500 పంపిస్తే ఫెయిల్ అని వస్తోంది.. నేను తర్వాత మీకు పంపిస్తా.. ఈ నంబర్‌కు అమౌంట్ పంపించండి' అని విజేత పెట్టినట్టుగా మరో నంబర్ జత చేసి రిక్వెస్ట్ పోస్ట్ పెట్టారు. ఈ విషయాన్ని పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఇది తాను పెట్టిన రిక్వెస్ట్ కాదని, తన అకౌంట్‌ను హ్యాక్ చేశారని పేర్కొంటూ వాట్సప్ స్టేటస్, ఫేస్‌బుక్‌లో పెట్టారు. ఈ విషయమై సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విజేత వెల్లడించారు.

వాహనం ఢీకొని యాచకుడు మృతి

సత్తుపల్లిరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందిన ఘటన సత్తుపల్లి శివారులో బుధవారం చోటుచేసుకుంది. కిష్టారం – వెంగళరావునగర్ సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో సత్తుపల్లి పట్టణంలో భిక్షాటన చేసుకుంటున్న సత్తిపండు అని పిలుచుకునే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి తరఫు బంధువులు ఎవరూ లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది దహన సంస్కారాలు నిర్వహించినట్లు తెలిసింది. సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లోనూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని సమాచారం.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మంలీగల్: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరం పాండురంగాపురానికి చెందిన షేక్ యాకూబ్‌పాషాకు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. పాండురంగాపురానికి చెందిన కాటిరెడ్డి రామిరెడ్డి వద్ద యాకూబ్ పాషా 2012, మే 10వ తేదీన రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకుని అదే రోజు ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. రామిరెడ్డి డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేయగా 2013, మే 29న చెక్కు ఇచ్చాడు. దానినిక బ్యాంకులో జమ చేయగా యాకూబ్‌పాషా ఖాతాలో సరిపడా నగదు లేక బౌన్స్ అయింది. రామిరెడ్డి తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి, నిందితుడిపై ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారించిన జడ్జి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

సత్తుపల్లిటౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బుధవారం పట్టణ సీఐ టి.కిరణ్ బాధితులకు అందించారు. పట్టణానికి చెందిన ఉబ్బల వెంకటేశ్వరరావు రూ.10 వేల విలువైన సెల్‌ఫోన్, యాతాలకుంటకు చెందిన నాగార్జున పద్దమ్మ రూ.10 వేల విలువైన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు సీఐ టి.కిరణ్, కానిస్టేబుల్ వేణు అందించారు. ఈ ఫోన్లు రాబట్టేందుకు కృషి చేసిన కానిస్టేబుల్ వేణును అభినందించారు.



సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అందిస్తున్న సీఐ కిరణ్

గంజాయి సేవిస్తున్న ముగ్గురు అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం నగరంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. వైరారోడ్ నుంచి వైఎస్సార్‌కాలనీకి వెళ్లే దారిలో సాగర్ కాల్వ గట్టుపై తల్లాడకు చెందిన తమ్మిశెట్టి నాగబాబు, పుట్ట సత్యనారాయణ, అనంతారంలోని గండ్లగూడెంనకు చెందిన మాలోత్ లోకేశ్‌నాయక్ గంజాయి సేవిస్తూ కనిపించారు. వీరి వద్ద తనిఖీ చేయగా.. 320 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం తరలించారు. దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఖమ్మం–1 సీఐ బి.కృష్ణ, ఎస్‌ఐలు ఎస్.జయశ్రీ, కె.సాయిబాబా, సిబ్బంది రామారావు, శశికాంత్, రమేశ్, నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.



నిందితులు, గంజాయిని చూపుతున్న అధికారులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



చెక్కల శంకర్ (ఫైల్)

రఘునాథపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందాడు. చెక్కల శంకర్ (48)నగరంలోని ఖానాపురానికి చెందిన చెక్కల శంకర్ (48) నగరంలోని ఓ సిండికేట్ దుకాణంలో కార్మికుడు (హమాలీ)గా పనిచేస్తున్నాడు. రోజు లాగే మంగళవారం పనిలో భాగంగా ఇల్లెందు వైపునకు ఇనుప చువ్వలను లోడు చేసుకొని ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై ట్రాక్టర్ ట్రక్కు అదుపుతప్పి పల్టీకొట్టింది. పైన ఉన్న శంకర్ చువ్వలతో పాటు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిష్టాపురంలో మరో వ్యక్తి...


సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం కిష్టాపురంలో వసంత కుటుంబరావు ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై వీఎం బంజర్‌కు వెళ్తుండగా కారు ఢీకొట్టింది. కుటుంబరావు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు ఏపీలోని మంగళగిరి ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జీవనాడిపై దాడి!

పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

ఇదంతా కమీషన్ల దాహం, అస్తవ్యస్థ పనుల పాప ఫలితం కాదా?

ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కిన చంద్రబాబు





2019 మే 29 నాటికి పునాది స్థాయి కూడా దాటని పోలవరం స్పిల్ వే



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఏరియల్ వ్యూ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు మన రాష్ట్రానికి జీవనాడి. గరిష్టంగా 194.6 టీఎంసీల సామర్థ్యంతో గోదావరిపై నిర్మిస్తున్న అతి పెద్ద జలాశయం ఇదే. కుడి, ఎడమ కాలువ ద్వారా 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతో గోదావరి, కృష్ణా డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ నగరం పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చవచ్చు. ప్రాజెక్టులో నిర్మించే జలవిద్యుత్కేంద్రంలో 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చు. పోలవరం పూర్తయితే రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారిపోవడం ఖాయం. దేశంలో ఈ స్థాయిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్తు అవసరాలను తీర్చే బహుళార్థ సాధక ప్రాజెక్టు మరొకటి లేదు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రారంభించిన పోలవరాన్ని విభజన నేపథ్యంలో 2014లో కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తామే వంద శాతం ఖర్చుతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రానికి ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి మరీ 2016 సెప్టెంబరు 7న అధికారంలో ఉండగా చంద్రబాబు దక్కించుకున్నారు. 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని నమ్మబలికి కేంద్రానికి హామీ ఇచ్చారు. 2014 ఏప్రిల్ 1 వరకూ ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం తెగేసి చెబితే దానికీ చంద్రబాబు తలూపారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఖరారు చేసిన ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను కమీషన్ల దాహంతో తుంగలో తొక్కి పనులు చేపట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించారు. చివరకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు. ఈ నిర్వాకాల కారణంగా 2019 జూన్ తర్వాత గోదావరిలో పోటెత్తిన భారీ వరద కాఫర్ డ్యామ్‌ల ఖాళీల మీదుగా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే పోలవరం పనులను అత్యంత సంక్లిష్టంగా మార్చింది. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల పనులను చంద్రబాబు గాలికొదిలేసి డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడమే ఈ క్లిష్ట పరిస్థితికి మూల కారణం.

అక్రమాలు అరికట్టి కీలక పనులు పూర్తి..

2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ సర్కార్ చేసిన చారిత్రక తప్పిదాలను సరి చేస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టారు. పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ రూ.2,917 కోట్ల విలువైన పనులను నవయుగకు నాడు చంద్రబాబు సర్కార్ నామినేషన్‌పై కట్టబెట్టింది. వీటితోపాటు జలవిద్యుత్కేంద్రం పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించడం ద్వారా రూ.783 కోట్లను ఖజానాకు వైఎస్ జగన్ ఆదా చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. ఎడమ కాలువలో వరాహ నదిపై అత్యంత పొడవైన అక్విడెక్టుతోసహా కీలకమైన పనులను విజయవంతంగా పూర్తి చేశారు.

జలవిద్యుత్ కేంద్రం


పోలవరం ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు ఎడమ వైపున 960 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్కేంద్రాన్ని నిర్మించాలి. ఎడమ వైపు ఉన్న కొండను తొలిచి 12 ప్రెజర్ టన్నెల్స్ తవ్వి టర్బైన్లను అమర్చి విద్యుత్కేంద్రాన్ని పూర్తి చేయాలి.

2014–19: టీడీపీ హయాంలో

జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనుల్లో కొండను తొలిచే పనుల్లో కేవలం 25 శాతం మాత్రమే చేసి టీడీపీ సర్కార్ చేతులు దులుపుకొంది.

2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవిద్యుత్కేంద్రం పనులు శరవేగంగా సాగాయి. కొండను తొలిచే పనులను యుద్ధప్రాతిపదిక పూర్తి చేసి 12 ప్రెజర్ టన్నెల్స్‌ను పూర్తి చేసింది. టర్బైన్లను అమర్చడానికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేసింది. టర్బైన్ల తయారీ బాధ్యతను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. జలవిద్యుత్కేంద్రం పనులను దాదాపుగా కొలిక్కి తెచ్చింది. పోలవరం జలాశయం పనులు పూర్తయ్యేలోగా విద్యుదుత్పత్తి ప్రారంభించే విధంగా జలవిద్యుత్కేంద్రం పనులను వేగవంతం చేసింది.




జలవిద్యుత్కేంద్రం పనులను సైతం కొలిక్కి తెచ్చారు. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. ఇక డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తేలిస్తే 18 నెలల్లోగా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. అయితే అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లు ఖరారు చేసి పనులు చేపట్టేలా సీడబ్ల్యూసీ ప్రణాళిక రచించింది. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం వ్యయమే రూ.33,168.23 కోట్లని, అందువల్ల 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని ప్రధాని మోదీకి నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్ అనేక సార్లు విన్నవించారు. ఈ క్రమంలో తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తికి సహకరించాలన్న వైఎస్ జగన్ వినతిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు పోలవరం తొలిదశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీ–జనసేనకు పొత్తు కుదిరింది. ఈ నేపథ్యంలో పోలవరానికి నిధులు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే అది ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుందని, అందువల్ల దాన్ని ఆపేయాలని బీజేపీ అధిష్టానంపై చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. ఇలా అడ్డుపుల్ల వేయడంతో నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది.

స్పిల్ వే:

గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా స్పిల్‌వేను నిర్మించాలి. ప్రాజెక్టు పనుల్లో తొలుత పూర్తి చేయాల్సింది స్పిల్ వేనే. 1,118 మీటర్ల పొడవు, 53.32 మీటర్ల ఎత్తుతో నిర్మించే స్పిల్ వేకు 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల వరకూ 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో గేట్లు అమర్చాలి. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా అత్యాధునిక హైడ్రాలిక్ హాయిస్ట్‌లను గేట్లకు అమర్చాలి. ప్రపంచంలో గరిష్టంగా వరద జలాలను దిగువకు విడుదల చేసే అతి పెద్ద స్పిల్ వే పోలవరంలోనే ఉంది.

2014–19: టీడీపీ హయాంలో



2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు 2016 డిసెంబర్ 30న స్పిల్ వే పనులను ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోయే నాటికి అంటే 2019 మే 29 నాటికి స్పిల్ వే పనులు పునాది స్థాయిని కూడా దాటలేదు. స్పిల్ వేలో కేవలం రెండు (39, 40) పియర్స్‌ను 30 మీటర్ల వరకూ చేసి వాటి మధ్య ఒక ఇనుప రేకు పెట్టి గేట్ అమర్చినట్లు 2018 డిసెంబర్ 24న చంద్రబాబు ఘనంగా ప్రకటించుకున్నారు.

2019–2024: వైఎస్సార్‌సీపీ పాలనలో

2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది జూన్‌లో ప్రారంభమైన వరద ప్రవాహం నవంబర్ వరకూ కొనసాగింది. 2020 మార్చి నుంచి 2021 వరకూ కరోనా మహమ్మారి విరుచుకు పడింది. అయితే గోదావరి వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్ రికార్డు సమయంలో స్పిల్ వేను పూర్తి చేశారు. లాక్‌డౌన్‌లోనూ జర్మనీ, జపాన్ నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని స్పిల్ వేకు 48 గేట్లను బిగించారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్ వే మీదుగా విజయవంతంగా మళ్లించారు.

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు

నదికి అడ్డంగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మించడానికి వీలుగా.. గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించేందుకు ఈసీఆర్ఎఫ్‌కు ఎగువన 2,840 మీటర్ల పొడవు, 43 మీటర్ల ఎత్తుతో ఒక కాఫర్ డ్యామ్‌ను, దిగువన 1,655 మీటర్ల పొడవు, 31.5 మీటర్ల ఎత్తుతో మరో కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలి.

2014–19: టీడీపీ హయాంలో

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించకముందే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్‌ను 1,396 మీటర్ల పొడవున పూర్తి చేసిన చంద్రబాబు 2018 జూన్ 11న జాతికి అంకితం చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మించాలంటే 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే 54 గ్రామాల్లోని 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఈమేరకు సీడబ్ల్యూసీ, పీపీఏకు హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభించింది. అయితే



రూ.484 కోట్లు ఖర్చు చేసి కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మిగతా నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాన్ని వదిలేసిన చంద్రబాబు సర్కార్ ఆ పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. 2019 జూన్‌లో ప్రారంభమైన గోదావరి వరద ప్రవాహానికి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారింది. దాంతో కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో సగటున 26 మీటర్ల నుంచి 36.5 మీటర్ల లోతు వరకు భారీ అగాధాలు ఏర్పడ్డాయి.



2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

ఎగువ కాఫర్ డ్యామ్ ప్రభావం వల్ల ముంపునకు గురయ్యే 8,446 కుటుంబాలకు రూ.1,670 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆ తర్వాత ఎగువ కాఫర్ డ్యామ్‌ను 43 మీటర్ల ఎత్తుతో, దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లతోపాటు 2.1 కి.మీ. పొడవున అప్రోచ్ ఛానల్, 2.92 కి.మీ. పొడవున స్పిల్ ఛానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ ఛానల్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని మళ్లించింది.

జీవం తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

తాజాగా పోలవరాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు జీవనాడి లాంటి ప్రాజెక్టును వైఎస్ జగన్ విధ్వంసం చేశారంటూ నిస్సిగ్గుగా బుకాయించారు. కమీషన్లకు ఆశపడి పోలవరం జీవం తీసిన చంద్రబాబు దీన్ని కప్పిపుచ్చి జీవం పోసిన వైఎస్ జగన్‌పై బురద జల్లే యత్నం చేయడాన్ని సాగునీటిరంగ నిపుణులు తప్పుబడుతున్నారు.

జిల్లా వార్తలు

అన్నదాన సత్రంలో సోలార్ విద్యుత్



పూజలు చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శాశ్వత అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్‌ను ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవస్థానం, ఓ ప్రైవేట్ విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ పేనులు దశల వారీగా నడుస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో అన్నదాన సత్రానికి 90 కిలోవాట్ల సామర్థ్యంతో పని చేసే సోలార్ విద్యుత్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈనెల 21న చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదుచేసుకోవాలని కోరారు. మగవారు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించి రావాలని సూచించారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ ఆర్ఎం వెంకన్నకు ఘనంగా వీడ్కోలు

ఖమ్మంమయూరిసెంటర్ : ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి, సీఎం ఈగా బదిలీపై వెళ్తున్న చెరుకుపల్లి వెంకన్నను సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజియన్ అభివృద్ధికి వెంకన్న చేసిన సేవలను పలువురు కొనియాడారు. సంస్థ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కాగా, ఖమ్మం ఆర్ఎంగా పదోన్నతిపై వచ్చిన ఎ.సరిరామ్ ఖమ్మం పాత బస్టాండ్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

వెదజల్లడంపై రైతుల ఆసక్తి!

- వరి సాగులో అందుబాటులోకి 'కరివేద' విధానం
- కూలీల సమస్యకు చెక్.. తగ్గనున్న వ్యయం
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు
- ఏటేటా పెరుగుతున్న మొగ్గు చూపుతున్న అన్నదాతల సంఖ్య



పొడి దుక్కిలో వరి విత్తనాలు వెదజల్లే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: వానాకాలం సీజన్ ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. మే నెల చివరి నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి, మిర్చితో పాటు వరి సాగు అత్యధికంగా నమోదవుతోంది. ఈ నేపథ్యాన వరి సాగు చేసే రైతులు వెదజల్లే పద్ధతిని అవలంబిస్తే ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ విధానంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తుండడంతో రైతులు కూడా ఆసక్తి చూపుతుండగా.. గత పదేళ్లుగా సాగుచేసిన మంచి ఫలితాలను సాధించడంతో ఇంకొందరు ముందుకొస్తున్నారు.

పాత విధానంలో వ్యయప్రయాసలు

రైతులు సహజంగా వరిసాగు చేసే విధానంలో ముందు నేల తయారీ.. విత్తనాలు నానబెట్టి నాట డం, కలుపు ఇలా ప్రతీ పనికి కలిపి సుమారు ఎకరానికి రూ.25 వేల వరకు ఖర్చవుతోంది. దీనికి తో డు కూలీల కొరత ఏటా పెరుగుతోంది. అయితే, నాటు వేసే పద్ధతి కాకుండా వరి విత్తనాలు వెదజల్లడం ద్వారా సాగు రైతు ఎకరానికి సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు మిగులడంతో పాటు కూలీల ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంతో ఒక్క కామేపల్లి మండలంలోనే సుమారు వెయ్యి ఎకరాలకు పైగా రైతులు కరివేద పద్ధతి ద్వారా వరి సాగుచేశారు.

ఖర్చులు ఆదా

వెదజల్లే పద్ధతిలో రైతులు మామూలుగా పొలం దుక్కి సిద్ధం చేసుకోవాలి. ఆతర్వాత ఎకరాకు సుమారు 10 నుంచి 12 కేజీల లోపు వరి విత్తనాలను చల్లాలి. ఈ పద్ధతిలో ఎక్కువ ఎత్తు పెరగని రకం విత్తనాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. అంతే కాక వ్యవసాయాధికారుల సూచనలు ఎప్పటికప్పుడు తీసుకుని సాగు చేయడం ద్వారా కూలీల ఇబ్బందులు లేకుండానే ఎకరాకు సుమారు రూ.10వేల వరకు వ్యయం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇటు వైపే రైతుల మొగ్గు

కామేపల్లి మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఇందులో గత గతేడాది సుమారు వెయ్యి ఎకరాలకు పైగా కరివేద విధానం అవలంభించారు. ఇక ఈ ఏడాది ఇది మూడింతుల మేర పెరగనుందని తెలుస్తోంది. ఇప్పటికే సుమారు 200 ఎకరాలకు పైగా కరివేద చల్లినట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలోని తాళ్లగూడెం తదితర గ్రామాల రైతులు సుమారు పదేళ్లుగా నేరుగా వరి విత్తనాలను విత్తి మంచి దిగుబడులను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రయోజనాలు అనేకం

సకాలంలో వరి విత్తుకోవడం తద్వారా యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవడానికి అనువైన వాతావరణం ఏర్పడుతోంది. నారుమడి పెంచే ఖర్చు కానీ నాటు వేయాల్సి అవసరం కానీ లేకపోగా విత్తన మోతాదు సగానికి సగం తగ్గుతుంది. నేరుగా విత్తుకున్నప్పుడు వరి వారం నుండి పది రోజులు ముందుగానే కోతకు వస్తుంది. ఫలితంగా 20 నుంచి 30 శాతం మేర నీరు సైతం ఆదాయం అయినట్లే. ప్రధానంగా కాల్వలు, పెద్ద చెరువుల కింద సాగుకు ఈ విధానం అత్యంత అనుకూలమని అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

గత ఏడాది మంచి ఫలితం



రెండెకరాల్లో గత ఏడాది వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే పని, ఖర్చు తగ్గడమే కాక కూలీల కోసం ఎదురుచూడాల్సిన పని తప్పింది. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించడంతో ఎకరానికి రూ.10 వేల మేర ఖర్చు తగ్గింది. ఈ ఏడాది కూడా అదేవిధానం అవలంభిస్తా.

– ఉప్పుగండ్ల నాగేశ్వరరావు, రైతు, పండితాపురం

రైతులకు ఎంతో మేలు..



రైతులు వెదజల్లే పద్ధతి పాటిస్తే శ్రమ తగ్గుతుంది. డ్రమ్‌సీడర్ విధానం ద్వారా కూడా వరి సాగు చేసుకోవచ్చు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ మంది ముందుకొచ్చేలా అవగహన కల్పిస్తున్నాం. ఈసారి ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నందున ఈ విధానంలో సాగు పెరుగుతుంది.

– అజ్మీరా శ్రీనివాసరావు, ఏడీఏ, ఖమ్మం డివిజన్

విధులకు ఆలస్యంగా వస్తే చర్య తప్పదు..

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణి ప్రధాన కార్యాలయ ఉద్యోగులు, అధికారులు సకాలంలో విధులకు హాజరు కాకున్నా, మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆలస్యంగా వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పర్సనల్ జీఎం దీక్షితులు స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 10 నిమిషాలు గ్రేస్ పీరియడ్ దాటితే ప్రధాన గేట్ మూసేస్తామని, ఈ మేరకు సింగరేణి యాజమాన్యం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో 9.30 తర్వాత పది నిమిషాలు, మధ్యాహ్న భోజన విరామ సమయంలో 1.30 తర్వాత 10 నిమిషాలు సమయం ఉంటుందని తెలిపారు. ఈ ఉత్తర్వులు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 32 మంది, మధ్యాహ్నం 62 మంది, బుధవారం ఉదయం 19 మంది, మధ్యాహ్నం 52 మంది విధులకు ఆలస్యంగా హాజరయ్యారని, వీరి వివరాలను కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్ ద్వారా సేకరించి ఆయా శాఖల అధికారులకు పంపించామని తెలిపారు. ఇకనైనా వీరిలో మార్పు రాకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మస్టర్ పడిన తర్వాత ఎవరైనా కార్యాలయం దాటి వెళితే, వారికి గైర్హాజరుతో పాటు వేటు తప్పదని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, నిబద్ధత పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కందుల ధరకు రెక్కలు

క్వింటా ధర రూ.11,400గా నమోదు

ఖమ్మంవ్యవసాయం: కందుల ధరకు రెక్కలొచ్చాయి. సాగు విస్తీర్ణం తగ్గడంతో పంట ఉత్పత్తి లేక ధర పెరుగుతోంది. బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కందులకు రికార్డు ధర పలికింది. క్వింటా ధర ఏకంగా రూ.11,400గా నమోదైంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం కందులకు క్వింటా రూ.7,000 మద్దతు ధరగా ప్రకటించింది. పంట సీజన్ సమయంలో రూ. 9 నుంచి రూ. 10 వేల వరకు ధర పలికింది. కొద్ది రోజులుగా కందుల ధర పెరుగుతూ రూ.11 వేల మార్కు దాటింది. అరకొరగా పడించిన పంటను రైతులు మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తున్నారు. నిత్యం ఇద్దరు, ముగ్గురు రైతులు కొద్ది మొత్తంలో పంటను విక్రయానికి తెస్తున్నారు. ఆహార పంటల్లో ఒకటైన కంది సాగు విస్తీర్ణం దేశ వ్యాప్తంగా గణనీయంగా తగ్గింది. పంట సాగు దాదాపు ఆరు నెలల పాటు ఉండటంతో రైతులు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. తక్కువ కాలం పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే కొందరు రైతులు కందిని పలు రకాల పంటల్లో అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. పత్తి, ఉద్యాన పంటలైన మామిడి, ఆయిల్ పామ్, వరి గట్లపై, వేరుశనగ వంటి పంటల్లో అతర పంటగా సాగు చేస్తున్నారు. అయిననప్పటికీ గతంతో పోలిస్తే ఈ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగయ్యే కంది సాగు విస్తీర్ణం ప్రస్తుతం వందల ఎకరాలకు పడిపోయింది. గతేడాది జిల్లాలో కేవలం 173 ఎకరాల్లో మాత్రమే కంది సాగు చేశారు. సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ఉత్పత్తి లేక పంటకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. స్థానికంగా పండే పంట జిల్లాకు ఆహార పంటగా సరిపోదు. పొరుగు జిల్లాల్లో పండించిన పంటను మిల్లర్లు దిగుమతి చేసుకొని పప్పుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. గతంలో ఇక్కడ పండించే కందులను మిల్లర్లు పప్పుగా తయారు చేసి తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. అలాంటిది ప్రస్తుతం పొరుగు జిల్లాల నుంచి కందులను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కందుల ధర పెరుగుతుండటంతో పప్పు ధర కూడా పెరుగుతుంది. దీంతో సామాన్యులు కందిపప్పు కొనుగోలు చేయడం కష్టమే అనడంలో సందేహం లేదు. పంట నిల్వ చేసిన రైతులకు మాత్రం ప్రస్తుతం లభించే ధర పండుగేనని చెప్పవచ్చు.

కొద్ది రోజులుగా ఖమ్మం మార్కెట్‌లో కందుల ధర క్వింటాకు(రూ.లలో)

తేదీ	కనిష్టం	గరిష్టం
జూన్ 19	11,400	11,400
18న	10,500	10,500
13న	10,750	8,800
మే 9	11,110	11,110
మే 10	10,700	5,000



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన కందులు(ఫైల్)

22న జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్ఎం)ఎంపిక పరీక్ష ఈనెల 22న ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ.సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ ఎన్పీడీసీఎల్ రూపొందించిన నిబంధనల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు జేఎల్ఎంల పోస్టుల భర్తీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక పరీక్ష ప్రక్రియ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలను అధికారుల పరిశీలనకు అందించాలని సూచించారు. అనంతరం స్తంభం ఎక్కే పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు ఎంపికైన వారికి ఇప్పటికే పోస్ట్ ద్వారా సమాచారం ఇచ్చామని, అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జమలాపురం ఆలయ సొమ్ము స్వాహా నిజం కాదు..

ఆలయ ఈవో జగన్మోహన్‌రావు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి చెందిన రూ.3 లక్షల నగదును అందులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి స్వాహా చేసినట్లు సోషల్ మీడియాలో బుధవారం విస్తృతంగా ప్రచారమైంది. దీనిపై ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు బుధవారం స్పందించారు. శనివారం, ఆదివారం రోజుల్లో వచ్చిన లడ్డూ కౌంటర్ ఆదాయం ప్రతిసారి సోమవారం బ్యాంకులో జమ చేస్తామని, సోమవారం కూడా బక్రీద్ కారణంగా సెలవు దినం కావడంతో సదరు ఆలయ ఉద్యోగి మంగళవారం ఆలయ క్యాష్ కౌంటర్‌లో జమ చేశారని, ఆ వెంటనే బ్యాంకులో నగదు జమ చేశామని చెప్పారు. ఆలయ ప్రతిష్ట దెబ్బతీసేలా కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మొద్దని, అసత్య ప్రచారాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఈఓ వెల్లడించారు.